## ఎమ్మెల్యే మందుల సామేలుకు సన్మానం

నాగారం, డిసెంబర్ 15 : తుంగతుర్తి నియోజక వర్గ ఎమ్మెల్యే మందుల సామేల్‌ను తిరుమలగిరి మాజీ జడ్పీటీసీ పేరాల పూలమ్మాసోమయ్య సన్మానించారు. శుక్రవారం హైదరాబాద్‌లోని ఎమ్మెల్యే నివాసంలో ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించి శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు ఘంటా శ్యామ్‌సుందర్‌రెడ్డి, సోమిరెడ్డి, బొబ్బలి గట్టయ్య, కర్నాటి అంజయ్య, బోడ చంద్రయ్య, బొట్టు సురేశ్ పాల్గొన్నారు.



ఎమ్మెల్యే మందుల సామేలుకు శుభాకాంక్షలు తెలుపుతున్న మాజీ జడ్పీటీసీ

## రాష్ట్రస్థాయి బేస్‌బాల్ పోటీలకు చివ్వెంల గురుకుల విద్యార్థులు

చివ్వెంల, డిసెంబర్ 15 : రాష్ట్రస్థాయి బేస్‌బాల్ పోటీలకు చివ్వెంల ఎస్సీ బాలుర గురుకుల కళాశాల విద్యార్థులు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ బి.యాదయ్య శుక్రవారం తెలిపారు. ఈ నెల 14న కోదాడ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన ఉమ్మడి జిల్లా స్థాయి బేస్‌బాల్ పోటీల్లో అండర్-14 బాలుర విభాగంలో బి.అజిత్, బి.అభినయ్, అండర్-17 బాలుర విభాగంలో బి.తేజ్‌కుమార్, జి.వినయ్ ఉత్తమ ప్రతిభ కనబరిచి ఈ 17న మహబూబాబాద్ జిల్లా తొర్రూర్‌లో జరుగనున్న రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు చెప్పారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ ఎం.సుజాత, పీఈటీ రహీం పాల్గొన్నారు.



రాష్ట్రస్థాయి బేస్‌బాల్ పోటీలకు ఎంపికైన విద్యార్థులను అభినందిస్తున్న అధ్యాపక బృందం

## నేడు మాజీ ఎమ్మెల్యే కిశోర్ జన్మదిన వేడుకలు

మద్దిరాల, డిసెంబర్ 15 : నేడు మండల కేంద్రంలోని బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంలో తుంగతుర్తి మాజీ ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్ జన్మదిన వేడుకలను నిర్వహించడం జరుగుతుందని బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు ఎస్‌ఏ రజాక్ తెలిపారు. మండలంలోని వివిధ గ్రామాల్లోని బీఆర్‌ఎస్ పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో వేడుకల్లో పాల్గొనాలని కోరారు.

# ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించాలి

● కలెక్టర్ ఎస్.వెంకట్రావ్



పరిశ్రమల శాఖ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ఎస్.వెంకట్రావ్

సూర్యాపేట, డిసెంబర్ 15 : జిల్లాలో ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఎస్.వెంకట్రావ్ ఆదేశించారు. శుక్రవారం జిల్లా పరిశ్రమల శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో అదనపు కలెక్టర్ ప్రియాంకతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లా ఏర్పడిన నాటి నుంచి టీఎస్ ఐపాస్‌లో భాగంగా 20 శాఖలకు సంబంధించి 952 దరఖాస్తులు అందినట్లు వాటిలో ఇప్పటి వరకు 758 దరఖాస్తులు పరిశీలించి అనుమతులు ఇవ్వడం జరిగిందన్నారు కేవలం 127 మాత్రమే తిరస్కరణకు గురైనట్లు వెల్లడించారు. జిల్లాలో ఎక్కువగా రైస్ మిల్లులు, ప్లాస్టిక్, సిమెంట్ ప్యాక్టరీలు, సిమెంట్ బ్రిక్స్‌కు దరఖాస్తులు వస్తుంటున్నట్లు చెప్పారు. టీ ప్రైడ్ పథకంలో భాగంగా ఎస్సీ, ఎస్టీ లబ్ధిదారులను ఆర్థిక స్వావలంభన దిశగా పారిశ్రామిక రంగంలో ఎక్కువగా ప్రోత్సహించాలన్నారు. ఈ పథకంలో ఎస్సీలకు 18, ఎస్టీలకు 131, దివ్యాంగులకు ఒక యూనిట్‌కు ప్రభుత్వం సబ్సిడీ మంజూరు చేయడం జరిగిందన్నారు. ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలతో త్వరలోనే సమావేశం నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. జీఎం పరిశ్రమలు తిరుపతయ్య, శ్రీదేవి, శంకర్‌బాబు పాల్గొన్నారు.

### దివ్యాంగుల సంక్షేమానికి కృషి

దివ్యాంగుల సంక్షేమానికి ప్రత్యేక చొరవ తీసుకోవడం జరుగుతుందని కలెక్టర్ ఎస్.వెంకట్రావ్ తెలిపారు. అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకుని కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రతి సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించే ప్రజావాణిలో దివ్యాంగుల సమస్యలపై వచ్చే ఫిర్యాదులను ప్రత్యేకంగా స్వీకరించి వెంటనే పరిష్కరించడం జరుగుతుందని వెల్లడించారు. మీ సేవలో సదరన్ సర్టిఫికెట్స్ ప్రమోషన్‌పై జరుగుతున్న ఇబ్బందులపై అధికారులతో విచారణ జరిపిస్తామని చెప్పారు. అనంతరం క్రీడా పోటీల్లో విజయం సాధించిన వారికి బహుమతులు అందించారు. కార్యక్రమంలో డీడబ్ల్యూఓ జ్యోతి పద్మ, డీఎంహెచ్‌ఓ కోటాచలం, డీఎస్పీ నాగభూషణం, దయానందరాణి, డాక్టర్ వెంకటేశ్వర్లు, డీఈఓ అశోక్ పాల్గొన్నారు.

### పాల ఉత్పత్తుల్లో ముందుండాలి

పాల ఉత్పత్తుల్లో జిల్లాను నంబర్ వన్‌గా ఉంచాలని అందుకు సొసైటీలను బలోపేతం చేయాలని కలెక్టర్ ఎస్.వెంకట్రావ్ సూచించారు. కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లా కో ఆపరేటివ్ డెవలప్‌మెంట్ కమిటీ ఏర్పాటు చేసిన సమావేశంలో అదనపు కలెక్టర్ ప్రియాంకతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. గ్రామీణ స్థాయిలో సొసైటీలకు కో ఆపరేటివ్ మూవ్‌మెంట్స్ బలోపేతం చేయడానికి నియమించిన కమిటీలు ప్రత్యేక కృషి చేయాలన్నారు. త్వరలో జిల్లాలో ఉన్న డైరీ యాజమాన్యాలతో సమావేశం ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. మత్స్య శాఖలో 160 సొసైటీలు ఉండగా 115 సొసైటీలకు ఎన్నికలు నిర్వహించామని మిగిలిన సొసైటీల ఎన్నికల నిర్వహణకు చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో డీసీఓ శ్రీధర్, డీఏహెచ్‌ఓ శ్రీనివాస్, డీఎఫ్‌ఓ రూపేంద్రసింగ్, డీఎం డీసీసీబీ వసంతరావు పాల్గొన్నారు.

## 'పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలి'

సూర్యాపేట అర్బన్, డిసెంబర్ 15 : పాత పెన్షన్ విధానాన్ని వెంటనే పునరుద్ధరించాలని సీపీఎస్ ఉద్యోగుల సంఘం సూర్యాపేట జిల్లా అధ్యక్షుడు లక్కపాక ప్రవీణ్‌కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని కోరారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఉద్యోగులకు ఇచ్చిన హామీ మేరకు వెంటనే పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని పేర్కొన్నారు.

## రైతు బంధుకు దరఖాస్తు చేసుకోవాలి : ఏఈలు

నాగారం/ నూతనకల్, డిసెంబర్ 15 : ఇటీవల నూతన పట్టాదారు పాస్ పుస్తకాలు పొందిన రైతులు రైతు బంధు కోసం దరఖాస్తు చేసుకోవాలని నాగారం, నూతనకల్ మండలాల వ్యవసాయ శాఖ అధికారులు పెండోట గణేశ్, మురళీబాబు తెలిపారు. శుక్రవారం ఆయా మండలాల వ్యవసాయ కార్యాలయంలో వారు మాట్లాడుతూ.. పట్టాదారు పాస్ పుస్తకం, ఆధార్ కార్డు, బ్యాంక్ అకౌంట్ జిరాక్స్‌తో దరఖాస్తు ఫారం నింపి మండల వ్యవసాయ కార్యాలయంలో గానీ లేదా ఏఈఓకు అందజేయాలన్నారు.

## ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలి

● టీ ఎమ్మార్పీఎస్ నాయకులు



నెమ్మికల్‌లో కరపత్రాలు ఆవిష్కరిస్తున్న టీ ఎమ్మార్పీఎస్ నాయకులు

ఆత్మకూర్.ఎస్, డిసెంబర్ 15 : ఈ పార్లమెంట్ సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణ బిల్లుకు చట్టబద్ధత కల్పించాలని తెలంగాణ మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి ఉమ్మడి నల్లగొండ జిల్లా ఇన్‌చార్జి కత్తి ఉపేందర్‌మాదిగ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎస్సీ వర్గీకరణ బిల్లుకు చట్టబద్ధత కల్పించాలని కోరుతూ డిసెంబర్ 20న ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద నిర్వహించే ధర్నాను విజయవంతం చేయాలని కోరారు. ఈ మేరకు మండలంలోని నెమ్మికల్‌లో శుక్రవారం కరపత్రాలు ఆవిష్కరించారు. కార్యక్రమంలో సూర్యాపేట జిల్లా ఉపాధ్యక్షుడు పాత కట్ల రమేశ్, జిల్లా ప్రధాన కార్యదర్శి వి.శంకర్, సత్యం, ఉపేందర్ పాల్గొన్నారు.

## దరఖాస్తుల ఆహ్వానం

సూర్యాపేట అర్బన్, డిసెంబర్ 15 : సూర్యాపేట జిల్లా వ్యాప్తంగా ఆసక్తి గల అభ్యర్థుల నుంచి టెక్నికల్ సర్టిఫికెట్ కోర్స్ పూర్తి చేయుటకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి అశోక్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కనీసం విద్యార్హత 7వ తరగతి పూర్తి చేసి ఉండాలన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు ఆన్‌లైన్ ద్వారా పరీక్ష ఫీజును ఈ 29 లోపు చెల్లించి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అపరాధ రుసుముతో జనవరి 5 వరకు అవకాశం ఉన్నట్లు వెల్లడించారు. అభ్యర్థులు డ్రాయింగ్ (లోయర్) రూ.100, డ్రాయింగ్ (హయ్యర్) రూ.150, టైలరింగ్, ఎంబ్రాయిడరీ (లోయర్) రూ.150, టైలరింగ్, ఎంబ్రాయిడరీ (హయ్యర్) రూ.200 చెల్లించాల్సి ఉంటుందన్నారు. దరఖాస్తులు WWW.BSE.TELANGANA.GOV.IN వెబ్‌సైట్ ద్వారా నమోదు చేసుకోవాలని, మరిన్ని వివరాలకు జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో సంప్రదించాలని పేర్కొన్నారు.

### ఎమ్మార్పీఎస్ దండోరా రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా జానయ్య

బొడ్రాయిబజార్, డిసెంబర్ 15 : ఎమ్మార్పీఎస్ దండోరా రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా సూర్యాపేట జిల్లా కేంద్రానికి చెందిన దళిత రత్న కనుకు జానయ్య నియమితులయ్యారు. ఈ మేరకు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మేడి పాపయ్యమాదిగ ఉత్తర్వులు జారీ చేశారు. తన నియామకానికి సహకరించిన రాష్ట్ర అధ్యక్షుడు మేడి పాపయ్య, ప్రధాన కార్యదర్శి పల్లెటి లక్ష్మణ్‌కు జానయ్య ధన్యవాదాలు తెలిపారు.



సూర్యాపేట పట్టణంలో నిరసన ర్యాలీ నిర్వహిస్తున్న పోస్టల్ ఉద్యోగులు

## కొనసాగుతున్న తపాలా ఉద్యోగుల సమ్మె

● 4వ రోజు సూర్యాపేటలో భారీ నిరసన ర్యాలీ

బొడ్రాయిబజార్, డిసెంబర్ 15 : 8 గంటల పని విధానాన్ని అమలు చేసి పెన్షన్‌తో పాటు అన్ని రకాల సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేస్తూ తపాలా ఉద్యోగులు చేస్తున్న నిరవధిక సమ్మె శుక్రవారం 4వ రోజుకు చేరింది. జీడీఎస్‌పీజేసీఏ ఆధ్వర్యంలో శుక్రవారం నల్ల బ్యాడ్జీలు ధరించి 400 మంది ఉద్యోగులు పట్టణంలో భారీ నిరసన ర్యాలీ చేపట్టారు. తమ డిమాండ్లు పరిష్కారమయ్యే వరకు సమ్మె కొనసాగుతుందని సీఐటీయూ జిల్లా అధ్యక్షులు నెమ్మాది వెంకటేశ్వర్లు, మిర్యాలగూడ రిటైర్డ్ పోస్టల్ పీపీ రామయ్య ఈ సందర్భంగా తెలిపారు. కార్యక్రమంలో పోస్టల్ జేఏసీ కన్వీనర్ జి.నాగరాజు, చైర్మన్ రవి మతిన్, ఓ.లింగయ్య, సీహెచ్.పుల్లయ్య, తిరుపయ్య, కరుణాకర్, గోవింద్, శ్రీకాంత్, అఖిల, దివ్యశ్రీ, శ్రీయాంక, ప్రియాంక, రేవతి, మానసవాణి, సోనియా, భవాని పాల్గొన్నారు.

## ట్రాక్టర్‌ను ఢీకొన్న కారు.. వ్యక్తి మృతి

మద్దిరాల, డిసెంబర్ 15 : రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతిచెందాడు. ఈ ఘటన నల్లగొండ జిల్లా పానగల్ చెరువు వద్ద గురువారం రాత్రి జరిగింది. మద్దిరాల మండలం గోరెంట్ల గ్రామానికి చెందిన సంఘని ఉమేశ్‌వర్మ (28) ఈ నెల 14న వ్యక్తిగత పనులపై కారులో నల్లగొండకు వచ్చాడు. పనులు ముగించుకుని రాత్రి సమయంలో తిరుగు ప్రయాణమయ్యాడు. ఈ క్రమంలో పానగల్ చెరువు వద్దకు రాగానే రోడ్డుపై ఆగిఉన్న ట్రాక్టర్‌ను వెనుక నుంచి ఢీకొట్టాడు. దాంతో కారు నుజ్జునుజ్జు అవగా ఉమేశ్‌వర్మ అక్కడికక్కడే మృతిచెందాడు. సౌమ్యుడు, కలుపుగోలు వ్యక్తి అయిన ఉమేశ్ ఊహించని మరణంతో గ్రామంలో ఒక్కసారిగా విషాదఛాయలు అలుముకున్నాయి. ఉమేశ్‌కు భార్య, ఏడాది వయస్సు ఉన్న కుమారుడు ఉన్నాడు.

## పంచాయతీ కార్యదర్శులు అందుబాటులో ఉండాలి

● ఎంపీడీఓ ఇందిర

నూతనకల్, డిసెంబర్ 15 : మండలంలోని అన్ని గ్రామాల పంచాయతీ కార్యదర్శులు అందుబాటులో ఉంటూ సమస్యలను గుర్తించి పరిష్కరించాలని ఎంపీడీఓ ఇందిర అన్నారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. గ్రామాల్లో పారిశుధ్య సమస్యలను పరిష్కరించాలని, వీధుల్లో చెత్త పేరుకుపోకుండా ఎప్పటికప్పుడు ట్రాక్టర్ల ద్వారా తరలించేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. సమావేశంలో ఎంపీఓ శశికళ పాల్గొన్నారు.

### రేషన్ కార్డుదారులు ఈకేవైసీ చేసుకోవాలి : తాసీల్దార్

నూతనకల్, డిసెంబర్ 15 : రేషన్ కార్డుదారులు ఈ కేవైసీ అనుసంధానం చేసుకోవాలని ఆ మేరకు రేషన్ డీలర్లు చొరవ చూపాలని తాసీల్దార్ శ్రీనివాస్‌రావు అన్నారు. శుక్రవారం తాసీల్దార్ కార్యాలయంలో రేషన్ డీలర్లకు నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రేషన్ కార్డుల్లో ఉన్న లబ్ధిదారులందరూ తప్పనిసరిగా ఈ కేవైసీ చేసుకోవాలన్నారు. అలాగే రేషన్ డీలర్లు సకాలంలో డీడీ కట్టి నిత్యావసర సరుకులు ప్రజలకు అందించాలని సూచించారు. సమావేశంలో డిప్యూటీ తాసీల్దార్ శ్రీధర్ పాల్గొన్నారు.

## బడి బయట పిల్లల గుర్తింపునకు సర్వే

నాగారం, డిసెంబర్ 15 : నాగారం క్లస్టర్ పరిధిలోని డి.కొత్తపల్లి గ్రామంలో బడి బయట ఉండే పిల్లలను గుర్తించేందుకు శుక్రవారం క్లస్టర్ పీఆర్పీ మమిడాల హరిప్రసాద్ ఇంటింటి సర్వే నిర్వహించారు. బడి బయట పిల్లలు, మధ్యలో బడి మానేసిన పిల్లలు, నెల రోజులకు పైగా తరగతులకు హాజరు కాని పిల్లల వివరాలు తెలుసుకుని ప్రభుత్వ పోర్టల్‌లో నమోదు చేస్తున్నట్లు ఈ సందర్భంగా ఆయన తెలిపారు.



డి.కొత్తపల్లిలో సర్వే చేస్తున్న సీఆర్పీ హరిప్రసాద్

### 19న మండల సర్వసభ్య సమావేశం

తుంగతుర్తి, డిసెంబర్ 15 : ఈ 19న మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో సర్వసభ్య సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ భీమ్‌సింగ్‌నాయక్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే మందుల సామేల్ హాజరవుతున్నట్లు వెల్లడించారు. సంబంధిత శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు సకాలంలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.